# చీకట్లో రాలి...!



సంధ్యాలక్ష్మి

ప్రపంచమంతా శూన్యంగా ఉన్నట్లనిపించింది.

నా మిత్రుడి శవం నా కెదురుగా ఉంది.

నా కళ్ళలో నీళ్ళింకా రావటం లేదు. కానీ నన్ను గమనిస్తున్న వారందరికీ ఓ విషయం స్పష్టం అవుతూంది. నేనేదో తీవ్రమయిన భావోద్వేగానికి లోనయి ఉన్నాననే విషయం వారు కళ్ళలోనే చర్చించుకుంటున్నారు.

మా స్నేహం ఈనాటిది కాదు. సంవత్సరాల తరబడి ఎన్నో కష్టనష్టాల నడుమ అది అభివృద్ధి చెందింది. ఒక్కొక్కసారి ఆశ్చర్యం కలుగుతుంటుంది. ఈ స్నేహ సంబంధాలు కొనసాగుతున్న సమయంలో మాలో ఎన్నో బేధాలు, ఎంతో తీవ్రంగా ఒకరి భావాల్ని ఒకరు ఎదుర్కోవటం. అయినా ఏనాడూ వాటిని స్నేహంతో ముడి పెట్టలేదు. అతను నన్ను ప్రేమించాడు. ఎంతగా ప్రేమించాడో మూల నుంచి కన్నీళ్ళతో కదిలిపోతున్న శ్వేతకు తెలుసు.

శ్వేత రవి భార్య. ఇప్పుడామె వయసు ముప్పై లోపు ఉంటుంది. ఇంత చిన్న వయసులో ఆమెకీ స్థితి. రవికి ఆమెకంటే ఓ అయిదేళ్ళు ఎక్కువ ఉండొచ్చు. వారిద్దరూ ఒకరి కోసం ఒకరు పుట్టేరా అనిపిస్తుంది. వారిద్దరూ ఎంత అప్యాయంగా ఎంత అర్ధవంతంగా ఎంత అవగాహనతో సహజీవనం చేశారో గుర్తొస్తుంటే నా గుండెల్లో నుండి ఎగతన్నుకొస్తుంది దుఃఖం. దాన్ని ప్రయత్నం మీద పట్టి ఉంచుతున్నాను.

నా ప్రక్కనాయన సిగరెట్ త్రాగుతున్నాడు.

"ఓ సిగరెట్ ఇస్తారా" అడిగాను.

ఆశ్చర్యంగా చూసేడు నా వంక.

సిగరెట్టు త్రాగటం ఇదే మొదటిసారి. నా అనుభవంలో నన్నింతగా కదిలించిన సంఘటన కూడా ఇదే. మృత్యువు అత్యంత సహజమనే విషయం నాకు తెలుసు. నాతోపాటు అందరూ ఏదో రోజు పోవాల్సి ఉంటుందని కూడా తెలుసు. అయినా ఇంత భయంకరంగా విరుచుకు పడటాన్ని భరించలేకపోతున్నాను. ఇంక నాకు శూన్యం కాక మరేమిటి? నాతో సంభాషించేది, నాతో మాట్లాడేది నాతో తన అనుభవాల్ని పంచుకునేది ఎవరు? ఈ లోటు నేను పూడ్చుకోగలనా ?

సిగరెట్ కొస ఎర్రగా ఉంది.

శవం ప్రక్కన ఏర్పాట్లు జరిగిపోతున్నాయి. నిర్లిప్తంగా చూస్తున్న నేను ఏమీ మాట్లాడటం లేదు. నేను దుఃఖాన్ని భావోద్రేకాన్ని ఆపుకోవటానికి చేస్తున్న ప్రయత్నంలోనే ఉన్నాను. నా కళ్ళ ముందు సంవత్సరాల తరబడి మా అనుబంధం తాలూకు దృశ్యాలు .... పెద్ద పలకతో రవి భయం భయంగా నడిచొస్తున్న రోజు తొలి పరిచయం, మేం ఆడిన ఆటలు, చిలిపి పనులు, ఒక్కొక్క మెట్టు ఎక్కటం, నా జీవితంలో ప్రతి అనుభవం వెనుకా రవి! రవి వివాహం, శ్వేతతో జీవితం, మా ముగ్గురి అనుబంధం....

ఎవరెవరో ఏడుస్తున్నారు.

మృత్యువు సహజం

ఏడవటం సహజమే!

అన్నీ సహజంగా జరిగిపోతున్నాయి.

రవి శవం మీద శ్వేత వస్త్రం కప్పారు.

నుదుటి మీద ఎర్రటి బొట్టు.

అప్పటికి రావలసినవారు వచ్చారు. ఎవరెవరో తొందర పెడుతున్నారు. అంతా సిద్ధమైపోయింది. మరి కొంచెంసేపట్లో, క్షణాల్లో రవి ఉండడు. శ్వేత గుండెలు పగిలేలా ఏడుస్తూంది. ఆమెలా ఏడుస్తుంటే ఆ భావోద్వేగంతో నిజంగానే ఆమె గుండెలు బ్రద్దలయిపోవు కదా!

"ఊరుకో తల్లీ....విధినెవరూ తప్పించలేరు" ఓ ముసలాయన ఓదార్పు.

"ఇలాంటివి చూడమని ఇంకా మమ్మల్ని బ్రతికించాడు" ఎన్నో అనుభవాల నుండి రాలిన కన్నీటిబొట్టు ఆయనది.

శ్వేతను బలవంతంగా ప్రక్కకు తోశారు.

సంప్రదాయకంగా ఒక్కో కార్యక్రమం జరిగిపోతూంది.

నీళ్ళు పోస్తున్నారు రవి తల మీద. కడసారి జ్ఞాపకాల్ని కెమెరాలో బంధిస్తున్నారు.

అయిపోయింది. శవం భుజాలకెత్తుకున్నారు.

"శ్వేతా వీడ్కోలు" రవి శవం ఘోష!

శ్వేత తన భర్త...ఈ కొద్ది సంవత్సరాల అనుభవం త్రెంచేసుకుని పోతుంటే హృదయ విదారకంగా ఏడుస్తూంది - సహజంగా!

శ్వేత నవ్వును మాత్రమే చూచిన నేను ఈ స్థితిలో ఆమెను చూడాల్సి రావటం ఎంతటి దురదృష్టం.

జనం ముందుకు సాగిపోతున్నారు.

రవిని శ్మశానంలోకి...

నా అడుగులు తడబడుతున్నాయి.

మరి కొద్ది నిముషాల్లో...

రవి బూడిదగా మారిపోయాడు.

ఆ బూడిద కృష్ణా జలాల్లో కలిసిపోయింది - ఏ పంటభూముల్ని స్పృశించటానికో!

అంతా తిరిగి వచ్చారు.

అప్పటికప్పుడు వంటలు మొదలయ్యాయి. ఓ మూలగా కూర్చున్నాను శూన్యంలోకి చూస్తూ. అంతా ముగిసింది. ఎంత విచిత్రమైన సంక్లిష్టమైన మార్పులివి. ఏ రోజూ ఊహించలేదే. ఆశించలేదే. మన ఇష్టాలకు భిన్నంగా, ఊహలకు అందకుండా ఏమైనా జరగొచ్చుననేది తొలిసారిగా అనుభవంలోకి వచ్చింది.

"భోజనానికి రా బాబూ" పిలుస్తున్నారెవరో.

"నాకు ఆకలిగా లేదు."

"బాధగానే ఉంటుంది. కొంచెం ఎంగిలి పడు."

"లేదు. నన్ను బలవంతం చెయ్యకండి."

ఏమనుకున్నారో వెళ్ళిపోయారు.

భోంచేయాలట! ఎలా భోంచేస్తాను? రవి లేనిదే ఎలా సాధ్యమవుతుంది? నాకు నా తండ్రిని గురించిన జ్ఞాపకాలు లేవు. నా ఊహ తెలిసేటప్పటికే ఆయన మరణించాడు. ఆ తర్వాత అమ్మ పెంచుతూ వచ్చింది. మూడేళ్ళలో ఆమె కూడా వెళ్ళిపోయింది. ఆ వయసులో ఎలాంటి భావం లేదు. ఆ దుఃఖం వెనుక బాధాకరమైన ఆలోచనలుగాని భవిష్యత్తు గురించిన భయం లాంటివిగాని లేవు. అందుకు కారణం రవి. రవితో పాటు నేనూ పెరిగాను. రవి తల్లిదండ్రులు నా పట్ల ఎంతో ఆదరణ చూపించారు. మా స్నేహంలో ఉన్న గొప్పదనం ఏమిటంటే అది కృతజ్ఞతకు చెందిన విషయంగా ఉండకపోవటం.

మాకు పోట్లాట వచ్చినా, రవి కుటుంబం నాకు సహాయపడుతున్నా అవి వేటికవే ప్రత్యేక విషయాలుగా ఉండిపోయాయి తప్పించి మమ్మల్ని ప్రభావితం చెయ్యలేదు.

చాలాకాలంగా రవి నేను పెళ్ళి చేసుకోవాలంటూ బలవంతం చేస్తున్నాడు. కానీ ఎందుకో నాకు ధైర్యం లేదు. ఓ రకమైన ఒంటరితనానికి అలవాటుపడ్డాను. ఆ స్థితిని ఇష్టపడుతున్నాను. రవి స్నేహం తప్ప మరే విషయం నన్ను కదిలించలేదు. తిరిగి నేను స్వేచ్ఛగా మాట్లాడేది ఒక్క శ్వేతతోనే. ఆడవాళ్ళంటే నాకు బిడియం. శ్వేత కూడా ఈ విషయంలో నన్ను చాలసార్లు ఆటపట్టించింది. ఆమెతో చనువువల్లనే కొంత బిడియం పోగొట్టుకున్నాను. నాకంటూ ఎవరూ బంధువులు లేరు. ఉన్నా వారితో నాకెలాంటి సంబంధం లేదు. మరి నాకిప్పుడెవరున్నారని?

నేనెవరి కోసం భోంచేయాలి? ఎవరి కోసం బ్రతకాలి?

"బాబూ" ఎవరిదో పిలుపు...

వెనక్కి తిరిగాను మాట్లాడకుండా.

"ఒక్కసారి శ్వేతను ఓదార్చగలవా?" ఆ కంఠం వణికింది.

ఎందుకో ఆ మాటలు సూటిగా వచ్చి నా హృదయాన్ని తాకాయి: ఒక్కసారిగా నా అట్టడుగు పొరల్లో నిక్షిప్తమైన భావాలు ఎగిసిపడ్డాయి తిరిగి. అదురుతున్న పెదాల్ని బలవంతంగా నొక్కిపెడ్తూ, "ఒక్క నిముషం" అతి మెల్లగా అన్నాను.

అప్పుడు బ్రద్దలయింది. ఇక నావల్ల కాదు.

వరదలా త్రోసుకొస్తున్న దుఃఖం మెల్లగా మొదలై...వెక్కిళ్ళతో...

జలజల రాలుతున్న కన్నీళ్ళు...

అతను అవాక్కయి చూస్తున్నాడు.

ఎవర్ని ఓదార్చాలి?

శ్వేతనా? నన్నా?

*

మూడు రోజులు గడిచిపోయాయి.

రవి లేడు. పెద్ద ఫొటోలో వాడి చిరునవ్వు.

మేమిద్దరం కలిసి దిగినవి.

శ్వేతా... రవి.

వారి మెడలో మల్లెదండలు. ఆ మల్లెదండలు ఎంత అందంగా ఉన్నాయి. పూర్తిగా విచ్చుకుని మల్లెమొగ్గల్తో ఎంత అందంగా కట్టారవి. వాటి నడుమ తీగ మెరుస్తూ. అంతకంటే ఆ ఇద్దరి మొఖాల్లోనే వెలుగులు.

వెంటనే నా మొఖం మాడిపోయింది.

ఇంకా పది రోజులు...

ఆ తర్వాత శ్వేత మొఖంలో కాంతిపోతుంది. శపించబడ్డ దేవతలా ఆమె మిగిలిపోతుంది. ఎంతో సహజంగా జరిగిపోతుంది ఆ కార్యక్రమం. ఆ తర్వాత ఆమె జీవితం....!

భయంగా ఉంది ఆలోచించటానికి.

ఈ మూడు రోజులుగా నేను కాఫీల్తోనే నెట్టుకొచ్చాను. భోజనం చేయాలనిపించటం లేదు. ఇప్పట్లో భోంచేయగలనో లేనో కూడా చెప్పలేను.

రవి చచ్చిపోయాడు!

ఎందుకు చచ్చిపోయాడు?

గుండె నొప్పితో

గుండె నొప్పి రావటానికి కారణాలు?

ఏం చెప్పాలి? రవికెలాంటి అలవాట్లు లేవు.

అయినా ఈ వయసులో ఆ రకమైన జబ్బుకు లోనుకావటమే విచిత్రం. వాళ్ళ కుటుంబంలోనే గుండె జబ్బులున్నాయి. వంశపారంపర్యంగా రవికి మిగిలిందదే. అందుకేగా బాధంతా. ఏం తీసుకోకుండా, ముసలితనం రాకుండా, అకాలమృత్యువు వాత పడటం! శ్వేత జీవితం - మీద ఈ రకమైన రాక్షస హస్తం పడటం భరించలేకపోతున్నాను.

మూడు రోజులుగా దుఃఖ సాగరంలో శ్వేత. ఆమె భోం చేయటం లేదు. ఎవరు చెప్పినా వినదు. ఏం చేసినా ఆమెను ఓదార్చలేకపోతున్నారు. వారిద్దరి నడుమ సంబంధం అలాంటిది. ఆమె ఆ షాక్ నుండి ఇప్పుడే బయటపడలేదేమో. పురుషుడై ఉండి నేనేం తట్టుకోగలిగాను! అందులోనూ అంత సున్నితమైన మనసు కల శ్వేతకిది సాధ్యమవుతుందా?

ఏమయినా శ్వేత జీవితం అలా వాడిపోకూడదు.

మరేం కావాలి?

ఆమెకు తిరిగి నూతన జీవితం కావాలి.

ఎలా?

తిరిగి పెళ్ళా?

అవును పెళ్ళే....శ్వేతకు తిరిగి పెళ్ళి!

శ్వేత అంగీకరిస్తుందా?

ఏమో!

సంప్రదాయాలు?

ఇంకేం సంప్రదాయాలు? ఇంకానా!!

రోజులు గడుస్తున్నాయి.

రవి దినం చేశారు.

శ్వేత తల వంచింది.

ఆమె గాజులు బ్రద్దలయ్యాయి. ఆమె ముఖం మీద బొట్టు చెరిపేశారు. తెల్లటి బట్టలు ధరించక పోయినా, ఆమె జుట్టు బలవంతంగా కత్తిరించక పోయినా ఆమె ముఖంలో కళ పోయింది. సర్వస్వం పోగొట్టుకున్న అభాగినిలా ఉందామె. ఇంకా ఆమె శోకదేవతలానే ఉంది. కాలం కూడా ఆమెలో మార్పు తేవటం లేదు. రవి లేని గాయం ఆమెను ఎప్పటికీ బాధిస్తుంటుందేమో! రవి నిజంగా అదృష్టవంతుడు. తన నింతగా ప్రేమించే భార్య దొరకటం అదృష్టం కాదా?

ఈ నడుమ ఎప్పుడూ శ్వేతతో మాట్లాడటం జరగలేదు. ఆమె రెండుసార్లు ఎదురు పడింది. అయినా మా నడుమ మాటలు పెగల్లేదు. మెల్లగా నేనూ పరిస్థితుల కలవాటు పడ్డాను. నేనిప్పుడు భోంచేస్తున్నాను. మామూలుగానే స్నానం చేస్తున్నాను. సాయంకాలం పూట పార్కు కెళుతున్నాను. ఇవన్నీ చేస్తున్నానంటే రవిని పూర్తిగా మరిచిపోయానని కాదు. ఒంటరిగా ఉన్న ప్రతి నిమిషం రవి గుర్తొస్తున్నాడు.

రవి వెనగ్గా నడుస్తున్న దృశ్యం .... మధ్యలో ఓసారి శవాన్ని దించారు. తిరిగి లేచి వస్తాడేమోనని. దింపుడు కళ్ళెం ఆశలు. రవి లేచి వచ్చి ఇదంతా నాటకమని చెబితే ఎంత బాగుంటుంది! అ కన్నీళ్ళు సంతోషంగా మారి, రవిని కౌగలించుకొని....

మృత్యువెంత సహజమో తిరిగి అందరూ దాన్ని మరిచి పోవటమూ అంతే సహజమని ఆయన అన్నారు. ఆయన ఎవరో కాదు. రవి తండ్రి. తన జీవితంలో ఎందరో మనుషుల్ని చూశారు. తన చేతుల మీద పెరిగిన రవి పోతే ఆయన గుండెలెంత పగిలిపోయాయో! ఇలాంటి దృశ్యాలు చూసి చూసి గుండె బండబారిపోయినట్లయింది. అయినా సరే ఆయన తనువు చాలించలా! జీవితం మీది తీపిని మమకారాన్నిం చంపుకోలా! 'మీరెందుకు జీవిస్తున్నా'రంటే 'చావటం కోసం'అంటారు. చావటం కోసం బ్రతకటమెందు కంటే ప్రకృతి ధర్మం అన్నారాయన.

ఆయనది జీవితం నేర్పిన పాఠం. సృష్టి ఓ క్రమం ప్రకారం నడుస్తుంది. ఆ క్రమాన్ని బట్టి పోవాలి తప్పించి విరుద్ధంగాపోతే అంతా అపశ్రుతే. ఓ మనిషి చచ్చిపోవాలంటే క్షణాలు చాలు. అయినాసరే బ్రతుకుతున్నారు. దరిద్రంలోనూ... రోగాల్తో తీసుకుంటూ కూడా. ఎందుకు?

అదీ ప్రకృతి ధర్మం కోసమేనా!!



కళ్ళల్లో పడితే....

శ్యాం మోహన్: ఈ డాక్టర్ల ఫీజులు మరీ ఎక్కువైపోతున్నాయి. మొన్న దుమ్ము మా ఆవిడ కంట్లో పడింది. ఆమెకు వైద్యం చేయించడానికి ఏభై రూపాయలైంది.

రామ్మోహన్: చాలా చవకనే చెప్పాలి. నిన్న ఓ నెక్లెస్ మా ఆవిడ కంట్లో పడింది. ఐదువేలయింది నాకు.

*

నాకు నోటివెంట మాట రాలేదు-ఈ విషయం విన్నాక.

రవి గుండెజబ్బుతో పోయాడని విన్న రోజున ఇదే పరిస్థితి. అది నేను నమ్మలేదు. అసలు చేష్టలుడిగి బొమ్మలా నిలబడిపోయాను ఎంతోసేపు. మరి ఈరోజు రవి చనిపోయి సొంతం రెండు సంవత్సరాలు నిండకమునుపే శ్వేత వేరొకర్తో జీవితం పంచుకోవటమా!

ఇది నిజం కాదు. ఇది నిజం కాకూడదు!

ఏం ఎందుకు కాకూడదు?

ఎందుకేమిటి! శ్వేత పుట్టింది రవి కోసం. రవితోనే ఆమె జీవితం. అంతేగాని రవి లేనంత మాత్రాన మరొకర్తో జీవితం పంచుకోవటమా? ఇది ద్రోహం కాదా! నేరం కాదా! స్త్రీ మనసింతేనా? ఆమె త్యాగానికి మారుపేరని చెబుతారే. అలాంటిది రవి చనిపోయినప్పుడు గుండెలు పగిలేలా ఏడ్చిన శ్వేత ఈరోజు ఎలా మరో వ్యక్తిని ఆహ్వానిస్తోంది. రవి గుండెలు బ్రద్దలైపోవా? ఇంత దారుణం శ్వేత చేయగలదని రవి ఊహించాడా?

నా కళ్ళ నుండి ఆవిర్లొస్తున్నాయి.

నా అంతరాత్మ ఎదురు తిరుగుతూంది.

"నువ్వింత మూర్ఖంగా ఆలోచిస్తావా? రవి లేకుంటే ఆమెకింక జీవితం లేదా? రవి ఎందుకు చనిపోయాడు? ఆమెతో చెప్పి చనిపోయాడా? అసలిదేం ఆలోచన. రవికి శ్వేత ద్రోహం చేయటం ఏమిటి? శ్వేత చనిపోతే రవి మాత్రం ఒంటరిగా ఉండిపోయేవాడా? మరో యువతిని వివాహం చేసుకునేవాడు కాదా?"

"రవా! అలా ఎప్పుడూ చేయడు. ఇది నా ప్రగాఢ నమ్మకం. అయినా సొంతం రెండు సంవత్సరాలు నిండకుండా?"

"ఇది నమ్మకాల సమస్య కాదు. రెండు

కాకుంటే అయిదు సంవత్సరాలు. ఆ తర్వాతైనా ఇదే పరిష్కారం. ఇది అత్యంత సహజమే కదా!''

"సహజం...సహజం నేనీ మాటను భరించలేను.''

"అది కూడా సహజమే.''

"శ్వేత రవిని మోసం చేసింది దారుణంగా. వాడి ఆత్మ శాంతించదు.''

"పిచ్చి మాటలు. రవికి ఆత్మ ఉంటుందా? ఉంటే శ్వేతతో కాపురం చేస్తుందా?''

రవిని మోసం చెయ్యటం అంటే ఏమిటి! పురుషాహంకారంతో నువ్వు నిలువెల్లా మునిగిపోయావు. స్త్రీని భర్త మరణిస్తే గతంలో తగలేసేవారట. నీ ఆలోచన అంతకంటే ఏం తక్కువ?''

"నేనంత దుర్మార్గుడ్నా?''

"కాక మరేమిటి? శ్వేత నూతన జీవితంలోకి వెళుతున్నందుకు నువ్వు అభినందించాలి. ప్రోత్సహించాలి. అంతేగాని ఆమెపట్ల నీకిలాంటి ఆలోచనలొస్తున్నాయంటే నీకు తెలియకుండానే సంప్రదాయాల కఠిన భావాలు నీలో ఉన్నట్లే కదా! లేకుంటే నీ మనసులో ఏ దురాలోచనో లేదు కదా!''

"ఛీ...అది నీచమైన ఆరోపణ. ఆమె నా సోదరిలాంటిది. నన్ను గుండెల్లో దాచుకున్న రవికి ద్రోహం చేసేంత నీచుడ్ని కాదు. ఎందుకో నా మనసు అంగీకరించటంలేదు. ఇది సంప్రదాయాల సమస్య ఎంతమాత్రం కాదు. గౌరవాల సమస్య. నమ్మకాల సమస్య. ఆమె రవితో గడిపిన జీవితం మోసమేనా? వారిద్దరూ ఒకరి కోసం ఒకరు పుట్టారు. అలాంటిది శ్వేత ప్రక్కన మరొకరు నిలబడటమా! రవి ఇలా చేసేవాడా?! మనుష్యులు పోయినంత మాత్రాన వారి అస్తిత్వం పూర్తిగా నాశనమవుతుందా? ఇదేనా ప్రేమంటే! చిన్నప్పుడు అమ్మా-నాన్న పోతే నేనేం చేశాను. శ్వేత కూడా అలానే బ్రతకాలి. రవిని తలుచుకుంటూ....ఆ అనుభవాల్ను గుర్తుకు తెచ్చుకుంటూ....''

"చాలు....చాలు. గొప్ప వ్యక్తివి నువ్వు. నీ సోదరినైనా స్వయంగా చితిమీద పంపేట్లున్నావు. ఇంత అభివృద్ధి నిరోధక భావాలు నీలో గూడుకట్టుకున్నాయని ఇప్పుడే తెలుస్తూంది. శోకదేవతలా ఉన్న ఆమె జీవితానికి గమ్యం ఏమిటంటూ బాధపడ్డ నువ్వు-ఈ రోజు శ్వేత నిర్ణయాన్ని సమర్థించలేకపోతున్నావు. నీ మౌనం ఆమెనెంత గాయపరుస్తుందో ఏ క్షణం ఆలోచించలేదు.

"నీ ఆలోచనల వెనక వుంది రవి కాదు. స్త్రీ. ఆమెను ఎల్లకాలం బానిసగా ఉంచాలనే ఆలోచన... వ్యక్తిత్వంలేని బొమ్మగా మలచాలనే కుట్ర.''

నాలో సంఘర్షణ....

రెండు భావాల నడుమ తీవ్రమైన ఘర్షణ. శ్వేత నిర్ణయంపట్ల ఓ అభిప్రాయానికి రాలేకపోతున్నాను.

ఈ సమస్యను పరిష్కరించేది ఆయనే!

రవి తండ్రిగా, నా తండ్రిగా...

శ్వేత మామగా...

మనిషిగా...

*

ఆయన చిరునవ్వుతో విన్నారు.

నా మనసులో ఉన్న భావాల్ని యదాతథంగా వారి ముందుంచాను. నాలోని రెండురకాల సంఘర్షణల్ని కూడా చెప్పాను. ఆయన చిరునవ్వులో సైతం గంభీరత్వం ఉంది. కొంచెంసేపు కళ్ళు మూసుకున్నారాయన. తన బిడ్డ గుర్తుకొచ్చి ఉంటాడు. తన అనుభవాల్ని, సంప్రదాయాల్ని మేళవించుకొని మరీ చెప్పాలి. చెప్పేది బయటివారి కోసం కాదు! తన సమస్య...ఆదర్శం కోసం కాదు. ఆచరణ కోసం.

"బాబూ...నువ్వు రవి చనిపోయిన తొలి రోజుల్లో భోంచేశావా?'' అడిగారు.

"చెయ్యలేదు.''

"ఎందుకని?''

"చేయాలనిపించలేదు.''

"ఇప్పుడు?''

"చేస్తున్నాను''

"ఎందుకని?''

మాట్లాడలేకపోయాను.

ఆయన అడగకపోయినా ఆ చూపులో అదంతా నాటకమేనా అనే భావం కదలాడినట్లుంది.

"అవును బాబూ. రవి ఒక్కసారిగా నీ కళ్ళ ముందు నుండి వెళ్ళిపోయినప్పుడు ఆ బాధలో నీకు ప్రపంచమే శూన్యంగా తోచింది. బ్రతకటమే అనవసరం అనిపించి ఉంటుంది. అది ఆనాటి పరిస్థితి. అదెంత మాత్రం నాటకీయత కాదు. సహజమే. వాటన్నింటిని నువ్వు అధిగమించి బ్రతుకుతున్నావు. అది తప్పనిసరి కూడా. పోయిన వారితో మనం పోలేం. నా కళ్ళ ముందు నా చేతుల మీదుగా మీరు పెరిగారు. రవి వెళ్ళిపోయాడు. వాడితోపాటు నేను పోలేదు, అంటే నేను దుర్మార్గుడ్నంటావా? జీవితం ఎందుకు? జీవించటానికి కాకపోతే! నువ్వన్నావు. రవి కోసమే ఆ అమ్మాయి పుట్టిందని. నిజమే. వున్నంతకాలం ఆ దాంపత్యం, ఆ బంధం అత్యంత సహజంగా ఉంటుంది. రవి పోయాక ఆమె బాధ కూడా సహజమైన విషయమే. అవలా ఉండకపోతేనే అసహజం. ఈ సమాజంలో అలాంటి జీవితాల్నే చూసిన నాకు రవి కాపురం ఆదర్శవంతంగా ఉంటుంది.

"మరి అంతగా రవిని ప్రేమించిన శ్వేత ఎందుకు ఈ నిర్ణయం తీసుకుంటుందంటావ్? రవి జ్ఞాపకాల నుండి బయట పడటానికే. ఆ ఆలోచన నీకెందుకో కలగదు? ఓ యువతి నిండు జీవితాన్ని అడవిగాచిన వెన్నెలవటాన్ని ఎలా అంగీకరిస్తాం? ఏ ఖరీదు లేని వెన్నెలే అడవిలో పడితే ఉపయోగం లేదని బాధపడే మనం అది ఓ స్త్రీ జీవితానికి అన్వయించుకోలేమా? స్త్రీ వెన్నెలకంటే, అడవికంటే కూడా చులకనైపోయిందా!

"చిన్నప్పుడు మీ అమ్మా, నాన్న పోయారు. వారితోపాటు నువ్వూ పోయావా? లేదే! బ్రతికావు.



అది మా నాన్న పెన్ను!

"రామూ! ఇది నువ్వు చేసిన హోమ్ వర్క్ కాదు. ఈ రాత మీ నాన్నగారిదిలా వుంది"

"అలా వుందా టీచర్ .... మరి నేను మా నాన్నగారి పెన్నుతో చేశానుగా."

# జ్యోతి!... నా పేరు తిమిరం!



స్నేహానికి చిహ్నం నువ్వు
ద్రోహానికి నేస్తం నేను—అయినా
ద్రోహ తిమిరతతి అమవస ఒడినే
స్నేహ జ్యోతులై చుక్కలు వెలుగును !

నను తరిమేయాలని నీ పోరాటం
నిను మింగేయాలని నా ఆరాటం
ఈ ఆరాటాలూ, పోరాటాలూ
మనిషి మనిషిలో తారాటాలే !

నీ జననం—నా మరణం
నీ మరణం—నా జననం
మన జనన మరణ మృదంగ నినదం
ప్రజావాహినుల జీవన సమరం !

నిను చెరబట్టడం, నను రెచ్చగొట్టడం
వంచనాపరుల సంతత ప్రయత్నం
ఆ ప్రయత్నం పండించే వల్లేరుకాయలు
అమాయక ప్రాణుల సజీవ దహనాలు !

నేనుంటేనే నీ కందం - అందుకే
నువ్వంటే నాకిష్టం !
నీ వెలుగుకు రంగులద్దడం
నా జీవన పరమార్థం !

మనం ఆడుకునే దాగుడుమూతలు
రోజులు నెలలై యేళ్ళయి సాగును
మన వెలుగు నీడల తాళగతులలో
రంగు రంగుల చరిత్ర పూయును !

బాధల్నే ఆయుధాలుగా చేపడితే
అదును చూసి నీ చెరనే విడిపిస్తే
అంతరించదా ఆ క్షణమే తిమిరావళి !
అవతరించదా అవనికి దీపావళి ! !

—బాల

వారివి వేరే మరొకర్లో చూసుకున్నావు. సమాజంలో చూసుకున్నావు. అనాధలా బ్రతకలేదే. ఈ సమాజంలో అనాధలున్నారు. వారి బ్రతుకేమిటి? ఆలోచించావా? మనిషికి కావలసింది ఆస్తిపాస్తులూ .... అంతస్థులూ కాదు. విశాలంగా ఆలోచించటం'' అన్నారాయన.

సిగ్గుతో తల వంచుకొన్నాను.

''గతానికి చెందిన ప్రతినిధిగా ఉన్న మీరు...''

సాంతం పూర్తికానే లేదు.

''గతమంతా చెడ్డదనే భావిస్తున్నావా బాబు. ఈ తరానికి ప్రతినిధివయినా నీ ఆలోచనలు గతానివే కదా. మరి గతానికి చెందిన నాలో భవిష్యత్తుకు చెందిన ఆలోచన లెందుకుండవనుకుంటున్నావు. మీ తరం ఈ సమస్యనే తేల్చుకోలేకపోతే ఇంకెప్పుడు ఈ సమాజం ముందుకు పోయేది. గతంలోని సంప్రదాయాల్ని ఎలాంటి విమర్శ లేకుండా అందరూ ఆమోదిస్తారనుకుంటున్నావా? అది తప్పు. గతమయినా, రేపయినా తప్పు తప్పే. స్త్రీయే కాదు పురుషుడు కూడా బానిసగా బ్రతకకూడదు.'' అన్నారాయన దృఢంగా.

నా కళ్ళ ముందు ఒక్కొక్క పొరవిడిపోతోంది.

''స్నేహ మనేది గొప్ప విషయం. నువ్వు తీసుకున్న నిర్ణయం వెనుక బాధాకరమైన సామాజిక భావం ఉంది. అది స్త్రీని పురుషుని ఆస్తిగా చూడటం. సృష్టిలో ఏదీ ఎవరి సొంతం కాదు బాబు. ఒక స్త్రీకి ఒక పురుషుడు సరైనది. అది ఇరువురి విషయంలోనూ ఉండాలి. ఏదో ఒక అంగంపోతే మనిషి చావడు. అలాగే దురదృష్టకర సంఘటన జరిగితే మొత్తం జీవితాన్నే పణంగా పెట్టడం త్యాగం కాదు. అలా చేయాలనుకోవటం స్వార్థం. శ్వేత వయసెంతని? ఆమె అలా నిర్ణయం తీసుకోవడంపట్ల నువ్వు రవి మిత్రుడిగా హర్షించాలి. శ్వేతతోపాటు ఆ యువకుడికి విశాల హృదయముంటే తిరిగి ఆ సంసారం చక్కగా ఉంటుంది. వారిద్దరూ ఒకరి కోసం ఒకరు పుట్టేరన్నంత సహజంగా ఉంటుంది. ఇది సృష్టి క్రమం. నీకు తెలుసా ఎప్పుడో కొన్ని వందల సంవత్సరాల క్రితం ఇలాగే భర్త పోతే తన జుట్టు కత్తిరించటానికి తయారయిన వారితో ఒకటే ప్రశ్న వేసిందామె....''బాబూ తిరిగి పెరగదన్న నమ్మకముంటేనే నా జుట్టు కత్తిరించండ''ని. కోర్కెలు సహజం. అది మనుషుల్తోపాటు, అనుబంధాల్తోపాటు అంతరించవు'' అన్నారాయన.

ఆ మొఖంలో అదే చిరునవ్వు....గంభీరత!

అనంతమైన ఎత్తుకెదిగిన ఆయన వ్యక్తిత్వం...

శెలవు తీసుకొని బయలుదేరాను.

అనుమానాల నుండి నిర్దుష్టతలోనికి

చీకటి నుండి వెలుగుకి

సంకుచితత్వం నుండి విశాలతలోనికి

సరాసరి....

శ్వేత నా వంక ఆశ్చర్యంగా చూస్తోంది.

ప్రక్కనే ఆ యువకుడు

వారిద్దరి చేతులూ పట్టుకొని ఏకం చేశాను.

ఊహించని ఈ సంఘటనకు శ్వేత గుండె లోతుల నుండి ఉబికొచ్చిన సంతోషం కన్నీటి చుక్కలుగా మారి నా చేతుల మీద పడ్డాయి.

మేం ముగ్గురం తీవ్రమైన భావోద్వేగంలో ఉన్నాం!

అత్యంత సహజంగా ఉందా దృశ్యం! □